



ఓంకారనాదంతో మార్మోగిన శైవ క్షేత్రాలు

వెల్లివిరిసిన భక్తిపారవశ్యం

ఘనంగా మహాశివరాత్రి పర్వదినం

జిల్లాలో సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఓం నమః శివాయః అంటూ శివపంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ భక్తులు తన్మయులయ్యారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఓంకార నాదంతో శైవక్షేత్రాల పరిసరాలు మార్మోగాయి. ఆలయాల్లో మహదేవుని ఆధ్యాత్మిక స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. పరమేశ్వరుడిని లింగరూపంలో రుద్రాక్షలు, మారేడు దళాలు సమర్పించి అభిషేకించారు. మహాశివ రాత్రి ఉపవాసాలు, జాగరణలతో చైతన్యం కలుగుతుందనే అపార నమ్మకంతో ఉపవాస దీక్షలకు పూనుకొని శివనామ స్మరణతో జాగరణలు చేపట్టారు.



లింగాలఘణపురం మండల కేంద్రంలో కల్యాణంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడియం

తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసాలు, జాగరణలతో జిల్లా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులకు అనుగుణంగా ఆయా దేవాలయ కమిటీలు ఏర్పాట్లు కూడా ఘనంగా చేపట్టాయి.

ఘనంగా శివరాత్రి పర్వదిన వేడుకలు..

జిల్లాలో మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మహాశివుని దర్శనానికి తెల్లవారుఝాము నుంచే భక్తులు శైవ క్షేత్రాలకు బారులు తీరారు. నీలకంఠుని దర్శనానికి అధిక సంఖ్యలో

ప్రముఖుల పూజలు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని పలు దేవాలయాలను ప్రముఖులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బచ్చన్నపేట మండలం కొడ్వటూరు సిద్ధేశ్వర స్వామి దేవస్థానాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చిన్నరామన్‌చర్ల, ఎద్దుగూడెం గ్రామాలలోని ఆలయాలతో పాటు జనగామ మండలం చీటకోడూరు శ్రీ పంచకోసు రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చీటకోడూరు జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ స్వామి వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాలఘణపురం మండల కేంద్రంలో జరిగిన భద్రకాళి సహిత వీరభద్రస్వామి కళ్యాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు.

జనగామ మండలం చీటకోడూరు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు

చీటకోడూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

చీటకోడూరు శ్రీ పంచకోసు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 64వ వార్షిక మహోత్సవం సందర్భంగా ఉదయం 5 గం.ల నుంచి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కాసోజు రాజేశ్వరాచార్యుల నేతృత్వంలో స్వామి వారికి అర్చనలు, ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం 5 గంటలకు శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. రాత్రి మల్లికార్జున స్వామి వారి కల్యాణం, పెద్ద పట్నం, బోనాలు కార్యక్రమాలు నిర్వహించారు. సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వనమాల శేఖర్, దేవాలయ కమిటీ చైర్మన్ ఎలబోయిన కొమురయ్య, సభ్యులు కొత్త కరుణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఒంటేరు శ్రీనివాస్‌రెడ్డి, చిన్నిపెల్లి కరుణాకర్, చిన్నిపెల్లి శ్రీనివాస్, ప్రేమలతా రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జనగామలో..

జనగామ జిల్లా కేంద్రంలోని శివాలయం, బాణాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, సంతోషిమాత దేవాలయం, శ్రీ రామనాథ స్వామి దేవాలయం, ఓంకారేశ్వర స్వామి దేవాలయం, బతుకమ్మ కుంట విజయదుర్గామాత దేవాలయాల్లో రుద్రాభిషేకాలు చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పాలకుర్తిలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



బచ్చన్నపేట సిద్దేశ్వరుడికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు



జనగామలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

కమనీయం శివపార్వతుల కల్యాణం

- సిద్దులగుట్టలో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- పాలకుర్తిలో పాల్గొన్న అదనపు కలెక్టర్, డీసీపీ



బచ్చన్నపేటలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు మొక్కులు చెల్లిస్తున్న ఎంపీ చామల

బచ్చన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణలు.. మార్మోగిన మంగళ వాయిద్యాలు.. హరహర మహాదేవ శంభో సిద్ధేశ్వరా అంటూ భక్తులు చేసే శరణుఘోష మధ్య ప్రముఖ శైవక్షేత్రం కొడవటూరు సిద్దులగుట్టలో శివపార్వతుల కల్యాణం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ప్రధాన పూజారి ఓంనమఃశివాయ ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో అత్యంత ముఖ్యమైన ఘట్టం శివపార్వతుల కల్యాణం కావటంతో ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కల్యాణ వేడుకలకు హాజరై మొక్కులు చెల్లించి దేవతామూర్తుల పల్లకీ మోశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగంగౌడ్ ఉత్సవాలకు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉత్సవ విగ్రహాలను, పట్టువస్త్రాలను, తలంబ్రాలను రెవెన్యూ, ఆలయ అధికారులు, పూజారులు తీసుకువచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, మార్కెట్ చైర్మన్‌లు శివరాజ్‌యాదవ్, శ్వేత వెంకటాచారి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఏసీపీ నితిన్‌చేతన్ పర్యవేక్షణలో సీఐ అబ్బయ్య, ఎస్ఐలు అబ్దుల్ హమీద్, నగేష్, పోలీస్ సిబ్బంది భారీబందోబస్తు చేపట్టారు.

పాలకుర్తిలో...

పాలకుర్తి : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివ పార్వతుల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణోత్సవానికి స్థానిక ప్రభుత్వం తరుపున డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ పట్టు వస్త్రాలు, తలంబ్రాలు మేళ తాళాలతో తీసుకొచ్చారు. పండితులు తాటిపాముల నర్సింహమూర్తి శర్మ నేతృత్వంలో మంత్రోచ్చరణల నడుమ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న 130 మంది దంపతులకు ఆలయ సిబ్బంది కంకణాలను పంపిణీ చేశారు. శివ పార్వతుల కల్యాణానికి వివిధ జిల్లాల నుండి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఈవో మోహన్‌బాబు, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్, ఆలయ సిబ్బంది వెంకటయ్య, పూజారులు డీవీఆర్ శర్మ, అనిల్ శర్మ, నాగరాజు పాల్గొన్నారు.



శివ, పార్వతుల కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్

కూతురితో సహా బావిలో దూకిన తల్లి

- తల్లి క్షేమం.. రెండేళ్ల పాప మృతి
- కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం
- జనగామలో పండుగ పూట విషాదం



శ్రీప్రగతి (ఫైల్)

జనగామ రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత క్షణికావేశంతో చేసిన ఆత్మహత్యాయత్నానికి అభం శుభం తెలియని రెండేళ్ల పాప మృతి చెందిన ఘటన జనగామ మండలంలో చోటు చేసుకుంది. తరిగొప్పుల మండలం నర్సాపూర్‌కు చెందిన ఎడ్ల శోభ, యాదయ్య దంపతుల కుమార్తె గౌరిప్రియకు నాలుగు సంవత్సరాల క్రితం జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన ఆకుల రమేశ్‌తో వివాహం జరిగింది. పెళ్లి జరిగినపప్పటి నుంచి కుటుంబ కలహాలతో భార్య భర్తలకు తరచూ గొడవలు కావడంతో గౌరిప్రియ పుట్టింటికి వెళ్లిపోయింది. ఇరువురికి పెద్ద మనుషులు సర్ది చెప్పడంతో కొద్ది రోజులుగా భార్యాభర్తలు కలిసి ఉంటున్నారు. మంగళవారం రాత్రి భార్యాభర్తలకు గొడవ జరగడంతో మనస్థాపం చెందిన గౌరిప్రియ తన కూతురు శ్రీ ప్రగతి(2)తో కలిసి బుధవారం తెల్లవారుజామున గానుగుపహాడ్ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి ఇద్దరిని బయటకు తీయగా శ్రీ ప్రగతి బావిలోని నీరు మింగి మృతి చెందింది. గౌరిప్రియకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ రాజేష్‌కుమార్ చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

- జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 1002 మంది ఓటర్లు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్



ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

జనగామ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నేడు (గురువారం) జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లావ్యాప్తంగా 12 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నీచర్ వంటి సౌకర్యాలను కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

4 రూట్లు.. 12 పోలింగ్ కేంద్రాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 12 మండలాలు ఉండగా ప్రతీ మండలకేంద్రానికి ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ 12 పోలింగ్ కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా 60 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు అదర్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ఈ లెక్కన ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఐదుగురి చొప్పున 12 పోలింగ్ కేంద్రాలకు 60 మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటారు. వీరితో పాటు ఎన్నికల పరిశీలకులు, ఇతర సహాయకులు సైతం పనిచేస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 1008 మంది ఉపాధ్యాయులు, డిగ్రీ, జూనియర్ కాలేజీ లెక్చరర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

పోలింగ్ సామాగ్రి పంపిణీ

ఉపాధ్యాయ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో పోలింగ్ సామాగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించిన సిబ్బందికి బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, ఇతర మెటీరియల్‌ను అందించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పర్యవేక్షించారు. అనంతరం రూట్ల వారీగా ఏర్పాటు చేసిన బస్సుల్లో పోలింగ్ కేంద్రాల సిబ్బంది తరలివెళ్లారు.

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ కేంద్రం	ఓటర్లు
జనగామ	ప్ర.జూ.కాలేజీ(బాలికల), స్టేషన్ రోడ్డు, జనగామ	511
పాలకుర్తి	జడ్పీహెచ్ఎస్, పాలకుర్తి	84
దేవరుప్పుల	జడ్పీఎస్ఎస్, కామారెడ్డిగూడెం	52
కొడకండ్ల	జడ్పీఎస్ఎస్, కొడకండ్ల	32
తరిగొప్పుల	జడ్పీఎస్ఎస్, తరిగొప్పుల	16
జఫర్‌ఘడ్	జడ్పీఎస్ఎస్, జఫర్‌ఘడ్	29
బచ్చన్నపేట	జడ్పీఎస్ఎస్, బచ్చన్నపేట	70
స్టే.ఘన్‌పూర్	జడ్పీఎస్ఎస్ (బాలికలు), స్టే.ఘన్‌పూర్	67
నర్మెట్ట	జడ్పీఎస్ఎస్, నర్మెట్ట	31
రఘునాథపల్లి	జడ్పీఎస్ఎస్, రఘునాథపల్లి	47
లింగాలఘనపురం	జడ్పీఎస్ఎస్, లింగాలఘనపురం	47
చిల్పూరు	జడ్పీహెచ్ఎస్, చిల్పూరు	16
	మొత్తం -	1002

బలంగా బహుజనవాదం : ఇంటలెక్చువల్ ఫోరమ్

పూల రవీందర్‌కు బహుజనుల మద్దతు అని విశ్వాసం



సూర్యాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

నల్లగొండ, ఫిబ్రవరి 26: ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా బహుజనవాదం గెలుస్తుందని బహుజన మేధావులు విశ్వసిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో గతానికి భిన్నంగా ప్రచారంలో ఈ వాదం పనిచేసిందని అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు తదితరులు ఈ ఎన్నికల్లో బీసీ, బహుజన వాదాన్ని బలంగా ప్రచారం చేయడంతో ఈ సానుకూలత వచ్చిందని భావిస్తున్నారు. బీసీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపు ద్వారా రాష్ట్ర రాజకీయాలు మలుపు తిరుగుతాయని, ఇది బీసీ రాజ్యాధికార వాదానికి దోహదపడుతుందని చెబుతున్నారు. 35 పైగా ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్య సంఘాల మద్దతుతో బహుజన అభ్యర్థిగా రంగంలో ఉన్న పూల రవీందర్ గెలుపునకు ఈ నినాదం దోహదపడుతుందని చెప్పారు.

విద్యారంగంలో రవీందర్ ప్రస్థానం

పూల రవీందర్ సాధారణ ఉపాధ్యాయుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ ఉద్యమంలో టీటీజేఏసీ చైర్మన్‌గా, ఆరేళ్ల ఎమ్మెల్సీగా పనిచేశారు. ఈ కాలంలో ఉపాధ్యాయుల పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన విషయాన్ని బలంగా తీసుకెళ్లగలిగామని బీసీ నేతలు శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘంలోని వర్గ విభేదాలతో ఓటమిపాలైనా, గడిచిన ఆరేళ్ల రవీందర్ ఆ సంఘంలోనే ఉంటూ ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వచ్చారన్నారు. 010 ద్వారా ఉపాధ్యాయులకు వేతనాలు, మహిళా ఉపాధ్యాయులను చైల్డ్‌కేర్ సెలవులు, పండిట్, పీఈటీ అప్ గ్రేడేషన్, కేజీబీవీ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం, వివిధ పీఆర్సీ కాలాల్లో మెరుగైన ఫిట్‌మెంట్ సాధన, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల, గురుకులాల సిబ్బందికి ఉపయుక్తమైన ఎన్నో జీవోల వెనక రవీందర్ కృషి ఉందనేది ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్), యూనిఫైడ్ పెన్షన్ సిస్టమ్(యూపీఎస్)ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించడానికి కృషి చేస్తారని, పీఆర్సీలో ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తారన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్స్ ఉపాధ్యాయుల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలను సందర్శించి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థిస్తుంటే బహుజన బిడ్డగా పుట్టినందుకు, పోటీ చేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని పూల రవీందర్ పేర్కొంటున్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తనను ఆదరిస్తారని ఆయన ఆశిస్తున్నారు.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

అమ్మమ్మ ఇంటివద్ద ఆడుకుంటుండగా ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుపూరు మండలం నష్కల్ గ్రామానికి చెందిన పాశం రాజు-అపర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె తపస్వీ(4) ఉన్నారు. చిన్నారి అమ్మమ్మ గ్రామమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో వివాహ వేడుక ఉండగా రాజు దంపతులు కుటుంబ సమేతంగా వచ్చారు. అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్న చిన్నారి ఆడుకుంటూ వెళ్లి పక్క ఇంట్లో ఉన్న నీటితొట్టిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు తొట్టిలోనుంచి చిన్నారిని బయటకు తీసి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి నుంచి చిన్నారి మృతదేహాన్ని స్వగ్రామమైన నష్కల్‌కు తీసుకెళ్లారు.



తపస్వీ (ఫైల్) →




బాగున్నావా.. బిడ్డా..!!

వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం ఓ అరుదైన సన్నివేశం ఆవిష్కృతమైంది. రాజకీయంగా ప్రస్తుతం భిన్న పార్టీల్లో ఉన్న కడియం శ్రీహరి, దయాకర్‌రావు ఒకరిపై మరొకరు రాజకీయంగా విమర్శలు చేసుకుంటున్న విషయం అందరికి తెలిసిందే.. అయితే శివరాత్రి వేయిస్తంభాల దేవాలయంలో దర్శనం అనంతరం అక్కడ నిల్చున్న కడియం శ్రీహరి కూతురు, వరంగల్ ఎంపీ కడియం కావ్యను చూసిన మాజీ మంత్రి దయాకర్‌రావు 'బిడ్డా బాగున్నావా..' అంటూ ఆత్మీయంగా పలకరించారు. కరచాలనం చేసేందుకు చేయి చాచాడు. అంతే ఆత్మీయంగా కావ్య సైతం దయాకర్‌రావుతో కరచాలనం చేసి నవ్వుతూ ముచ్చటించింది. ఈ సన్నివేశాన్ని అక్కడున్న భక్తులు ఆసక్తిగా చూశారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్/హనుమకొండ

పేరుకే బందు.. ఫుల్లుగా మందు

- వైన్‌షాపులను తలపిస్తున్న బెల్ట్‌షాపులు
- కొనుగోళ్లకు ఎగబడుతున్న మద్యం ప్రియులు
- పట్టించుకోని అబ్కారీ, స్థానిక పోలీసులు
- సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులు మద్యం షాపులను బంద్ చేస్తున్నట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 25వ తేదీ సాయంత్రం 4గంటలకే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్‌లకు తాళాలు వేసి సీజ్ చేశారు. రెండు రోజులు బంద్ ఉన్న నేపథ్యంలో అబ్కారీ అధికారులు సీజ్ చేయడానికి ముందే వైన్స్‌షాపుల్లోని సరుకు అంత బెల్టుషాపుల్లో తరలించి నిల్వ చేసినట్లు తెలుస్తోంది. వైన్‌షాపు నిర్వాహకులు ఎంఆర్‌పీ ధర కన్నా అధికధరకు బెల్ట్‌షాపు నిర్వాహకులకు విక్రయించగా, దానిపై డబుల్ రేట్లు పెంచి మద్యంప్రియులుకు విక్రయిస్తున్నారు. నియంత్రించాల్సిన అబ్కారీ శాఖ చోద్యం చూస్తుంటే.. టాస్క్‌ఫోర్స్ బృందాలు అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని సీజ్ చేసి నిర్వాహకులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో అప్పగించారు.

దాడులను విస్మరించిన అబ్కారీ శాఖ

మద్యం షాపులు బంద్ ఉన్న ప్రతిసారీ గ్రేటర్ వరంగల్ శివారులోని బెల్టుషాపులన్నీ మద్యం ప్రియులతో కళకళలాడుతున్నాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలో హనుమకొండ, వరంగల్ అర్బన్, ఖిలావరంగల్, కాజీపేట పోలీస్‌స్టేషన్లు ఉండగా.. ప్రధానంగా ఖిలా వరంగల్, హనుమకొండ, కాజీపేట ఎక్సైజ్‌పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బెల్ట్‌షాపులు జోరుగా సాగుతున్నట్లుగా తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్న మద్యం అంతా హనుమకొండ, ఖిలావరంగల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోనిదే. హనుమకొండ పరిధిలో రూ.2,33,520 విలువైన మద్యం పట్టుబడగా, ఖిలావరంగల్ పరిధిలో రూ.1,21,540, కాజీపేట పరిధిలో రూ.1,14,390 విలువైన మద్యం పట్టుబడింది. బెల్టు షాపుల నిర్వహణపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నప్పటికీ అబ్కారీ మాత్రం ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ బెల్టుషాపులను, వైన్ షాపుల నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా బెల్టుషాపులు నిర్వహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లుగా తెలుస్తోంది. ఎక్కడపడితే అక్కడ మద్యం తాగుతూ.. రోడ్లపై ప్రయాణించే వారిపై దాడులు, మహిళల పట్ల అసభ్యకంగా ప్రవర్తిస్తున్నట్లుగా తెలుస్తోంది. బెల్టుషాపుల నిర్వాహకులతో వైన్‌షాపు నిర్వాహకులు కుమ్మక్కై బంద్‌లు వచ్చినప్పుడల్లా సరుకంతా బెల్ట్‌షాపుల్లోకి తరలించి అధికధరలకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం. శాకరాసికుంటలోని ఓ బెల్ట్‌షాపులో వైన్స్ యాజమాని హస్తం ఉన్నట్లుగా పోలీసులు విచారణలో వెల్లడైనట్లుగా సమాచారం.

అబ్కారీ అండదండలతో..

మద్యం షాపులు సీజ్ చేసినా అందులోని సరుకును బెల్ట్‌షాపులు, ప్రైవేట్ ఇళ్లలోకి లిక్కర్ డాన్‌లు ముందుగానే తరలించారు. రెండు రోజుల బంద్ నేపథ్యంలో అబ్కారీ శాఖ అండదండలతో విచ్చలవిడిగా రేట్లు పెంచి విక్రయించేందుకు డంప్ చేశారు. కాజీపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పార్క్‌లేన్ వెన్స్, ఖిలావరంగల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివ వైన్స్ యాజమానులు అధికారులు అండదండలతో బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

రూ.4 లక్షల 70 వేల మద్యం పట్టివేత

మద్యం షాపులు బంద్ చేసిన ఒక్కరోజులోనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు వివిధ బ్రాండ్‌లకు చెందిన రూ.3లక్షల55వేల మద్యాన్ని పట్టుకున్నారు. అత్యధికంగా కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్లసింగారం, కోమటిపల్లిలోని బెల్టుషాపుల నిర్వాహకులు జర్పుల రాజు, భూక్య స్వరూప, భూపతి మనోహర్‌బాబుల నుంచి రూ.2,33,520 విలువగల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాకరాసికుంటలో బెల్టుషాపుల నిర్వాహకులు చింత రాధిక, ఎనగందుల రాజు, సృజనల నుంచి రూ.1,21,540 విలుగ గల మద్యాన్ని, సుబేదారి పీఎస్ పరిధిలోని వడ్డెపల్లి, కాజీపేట దర్గాలోని బెల్ట్‌షాపు నిర్వాహకులు పల్లె ఉదయ్ కిరణ్, నాగవెల్లి రాహుల్, కొలిపాక అనసూయ నుంచి రూ.1,14,390 మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. కాగా, శాకరాసికుంటలోని ఓ బెల్ట్‌షాపును శివనగర్ బూడిదగడ్డ జంక్షన్‌లోని శివ వైన్స్ యాజమాని నిర్వహిస్తున్నట్లుగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో సదరు వ్యక్తి పరారయ్యాడు. కాగా, కేయూ పీఎస్ పరిధిలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. క్యాంపస్‌తోపాటు కాకతీయ కెనాల్, కోమటిపల్లిలో ఉన్న వెంచర్లు, ఓఆర్ఆర్‌కు ఇరువైపులా నిత్యం మద్యం ప్రియులు మద్యం సేవిస్తుంటారని స్థానికులు వెల్లడిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజే ఇదే విధంగా బహిరంగంగా మద్యం సేవిస్తూ ప్రజలను హింసిస్తారని ప్రజలు పేర్కొంటున్నారు.



కోమటిపల్లిలో పోలీసులు పట్టుకున్న మద్యం

నేడు అమెరికాలో ఉద్యోగ అవకాశాలపై సదస్సు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివ ర్సిటీలో ఫిబ్రవరి 27న సాయంత్రం 4 గంటలకు 'ఎక్స్‌ప్లోరింగ్ కేరీర్ అపర్చునీటిస్ ఇన్ ది యూఎస్' అనే అంశంపై ఫార్మసీ, ఇంజనీరిం గ్, కామర్స్, బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థులతో పాటు సోషల్ సైన్స్ విద్యార్థులకు సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ బుధవారం తెలి పారు. సదస్సులో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, అలాగే విశిష్ట అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హాజరవుతారని వెల్లడించారు. వీరితో పాటు కేయూ అల్యూమినీ, అమెరికా ఐటీ రంగ నిపుణులు, ప్రముఖ వ్యాపారవేత్త పులి రవి హాజరై సోషల్ సైన్స్ విద్యార్థులకు ఐటీ నైపుణ్యాలు, ఉద్యోగాలు అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేస్తారని వెల్లడించారు. అలాగే యూఎస్ కన్సల్టెంట్ అధికారి జెన్నీ ఫర్ లార్సన్ అమెరికాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు వీసీ నిబంధనలు, అడ్మిషన్ల ప్రాసెస్, అమెరికాలో భారతీయ విద్యార్థులకు లభించే అవకాశాలతో పాటు అభ్యర్థులకు ఏదీ అనుకూలం అనే విష యాలపై కూలంకశంగా మాట్లాడుతారని వివరించారు. సదస్సులో విద్యార్థుల సందేహాలపై పులి రవి, జెన్నీఫర్ లార్సన్‌లు సమాధానాలు ఇస్తారని పేర్కొన్నారు. సదస్సుకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు వ్యవహరిస్తారు.

ఓటుకు నోటు తీసుకుంటున్నారా.. తస్మాత్ జాగ్రత్త..!

- ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్
- నేరుగా డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్



వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : 'ఓటుకు నోటు తీసుకుంటున్నారా...? తస్మాత్ జాగ్రత్త...!' 'ఓటును నమ్ముకోవాలి... అమ్ము కోవద్దు...' అంటూ పంతుళ్ల వాట్సాప్ గ్రూపుల్లో మంగళవారం సా యంత్రం నుంచి ఓ మెసేజ్ వైరల్ అవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంతు ళ్లు పరాకుగా ఉండకుండా ప్రలోభాలకు లోబడి ఓటుకు నోటు తీసు కున్నా.. అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకొని పంపిణీ చేసినా.. వారిపై చర్యలు తప్పవనే వాట్సాప్ మెసేజ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. పంతుళ్లకు సం బంధించిన జీతభత్యాలు, తదితర లావాదేవీలు నిర్వహించే ఖాతా లన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని, ఖాతాల్లో అప్పనంగా జమవుతున్న డబ్బుల వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందనే చర్చలు పంతుళ్ల వర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని పంతుళ్ల ఖాతాలపై నిఘా వర్గాలు, సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా పెట్టినట్లు ఉపాధ్యాయ వర్గాలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. కొంత మంది ఉపాధ్యాయుల ఖాతాల్లోకి ఎన్నికల డబ్బులు వస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదవుతున్న సంఘటనలు ఉన్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకుంటున్న కొంత మంది ఉపాధ్యాయులు యూపీఐ పేమెంట్లు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్లు చేయకుండా నేరుగా చేతికి డబ్బులనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు కూడా ప్రచారంలో ఉంది. మొత్తంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయనే అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. సమాజ మార్గదర్శకులుగా ఉంటున్న ఉపాధ్యాయులు నిజాయితీతో ఓట్లు వేయాలని వారు నిక్కచ్చిగా చెబుతున్నారు.

కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య

- బాధితురాలి స్వస్థలం నల్లగొండ జిల్లా
- కారణాలు తెలుసుకుంటున్న పోలీసులు


రేస్మిత (ఫైల్)

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చుదువుతున్న గంటోజు రేస్మిత (19) ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం తానుంటున్న హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకుంది. తోటి విద్యార్థులు, పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లాకేంద్రంలోని రాక్‌హిల్స్‌కాలనీకి చెందిన రేస్మిత ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా నడుస్తున్న వరంగల్ వ్యవసాయ కళాశాలలో చదువుకుంటోంది. అయితే రేస్మితకు వరంగల్‌లో చదువుకోవడం ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులు నచ్చచెప్పి కళాశాలకు పంపించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తానుంటున్న హాస్టల్ గది తలుపులు ఎంతకూ తీయకపోవడంతో విషయం తెలుసుకున్న కళాశాల అధికారులు రేస్మిత తండ్రితో పాటు ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే చేరుకుని గది తలుపులు పగులకొట్టి చూడగా అప్పటికే రేస్మిత ఫ్యాన్‌కు వేలాడుతోంది. ఈలోగా కళాశాలకు వచ్చిన తండ్రి గంటోజు సత్యనారాయణ కూతురిని చూసి బోరున విలపించారు. ఆమె మృతికి కారణాలను తెలుసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌హెచ్‌వో రాఘవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవిపై ఆదివాసీలకే హక్కు

తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ సిద్ధబోయిన లక్ష్మీనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వడ్డెపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో తరతరాలుగా జీవన మనుగడ కొనసాగిస్తున్న ఆదివాసీలకే అడవిపై పూర్తి హక్కులను కల్పించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ సిద్ధబో యిన లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్‌లో నిర్వహించిన తుడుందెబ్బ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని పొందుపర్చిన ఆదివాసీల హక్కులు, చట్టాలు విధ్వంసం అవుతున్నాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని భూములు, ఖనిజ సంపద కార్పొరేట్ శక్తులకు పాలక ప్రభుత్వాలు ధారాదత్తం చేస్తున్నాయని దుయ్యబట్టారు. గోండు వీరుడు, ఆదివాసీ ముద్దు బిడ్డ కొమురంభీం యుద్ధభూమి అయిన అసిఫాబాద్ జిల్లా కెరమేరి మండలం జోడెన్ ఘాట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే తుడుం దెబ్బ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ ఖాసీం, ప్రముఖ న్యాయవాది త్రినాథరావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని లక్ష్మీనారా యణ తెలిపారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ స్టేట్ కో కన్వీనర్లు ఆగబోయిన రవి, కొట్నాక విజయ్, గోగల కోటయ్య, ఎస్. సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో ఉద్యోగాలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 55 పోస్టులు
- హనుమకొండ, వరంగల్ డివిజన్లలో 26, 29 ఖాళీలు
- బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్ ఖాళీలకు నోటిఫికేషన్
- పదో తరగతితో మెరిట్ ఉద్యోగార్హత
- దరఖాస్తుల దాఖలుకు మార్చి 3 చివరి తేదీ

హనుమకొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతిలో మెరిట్ మార్కులు తెచ్చుకున్న నిరుద్యోగులకు శుభవార్త. దేశవ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి వివిధ పోస్టల్ సర్కిళ్లలో ఖాళీగా ఉన్న మొత్తం 21,413 గ్రామీణ డాక్ సేవక్ పోస్టులకు సంబంధించి భారతీయ తపాల శాఖ నియామకాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడులైంది. 2023 జనవరిలో దాదాపు 40 వేల పోస్టులను భర్తీ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ పోస్టులకు అభ్యర్థుల ఎంపికలో భాగంగా కేవలం పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగానే వీటిని భర్తీ చేయనున్నారు. తపాల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్-2025) బ్రాంచ్ పోస్టు మాస్టర్లు (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్లు (ఏబీపీఎం), డాక్ సేవక్ (డీఎస్) పోస్టులకు ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, హనుమకొండ డివిజన్ తపాల శాఖ పరిధిలో మొత్తం 55 ఖాళీలను ఈ నోటిఫికేషన్‌లో చూపారు. వీటిలో వరంగల్ డివిజన్ పరిధిలో 29 పోస్టులు ఉన్నాయి. ఇందులో బీపీఎం 16, ఏబీఎం 9, డాకోసేవక్ 4 ఖాళీలు ఉన్నాయి. హనుమకొండ డివిజన్ పరిధిలో మొత్తం 26 ఖాళీలు ఉండగా వీటిలో బీపీఎం 17, ఏబీపీఎం 8, డాకొసేవక్ 1 ఖాళీ ఉన్నాయి.

హనుమకొండ డివిజన్‌లో..

బొల్లెపల్లి, దమ్మన్నపేట, ధర్మపురం, గూడూరు, ఈరవెన్ను, ఇస్సిపేట, కామారం, కామారెడ్డిపల్లి, కొడవటూరు, కొండాపూర్, లద్నూర్, లింగపల్లి, మద్దూరు, మంగపేట, నర్సాపూర్, మర్మాముల, మర్దకర్ట్, ముప్పన, నాగపూర్, నారాయణగిరి, పెద్దాపూర్, పెంబర్తి, రాజవరం, రామచంద్రాపురం, తరిగొప్పుల, విశ్వనాథపురం బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

వరంగల్ డివిజన్‌లో..

అమ్మాపూర్, అయ్యగారిపల్లి, బత్తులపల్లి, బొల్లికుంట, చింతపల్లి, చౌటపల్లి, దామెర, దమ్మన్నపేట, దన్నసరి, ధర్మారం, ఈదులపూసలపల్లి, గీసుకొండ, గూడూరు, జయపురం, కన్నెగుండ్ల, కంఠాయపాలెం, కార్లాయ్ మడగుడ, మహబూబాబాద్, మల్లారెడ్డిపల్లి, మాడుగుల, నాగారం, నల్లబెల్లి, నేరెడ, నెక్కొండ, పున్నేలు, పురుషోత్తమాయగూడెం, రంగశాయిపేట, సాగరం బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

దరఖాస్తు ఇలా..




తపాలశాఖలో ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉన్నవారు పదో తరగతి ఉత్తీర్ణత మెమోతో పాటు, ఆధార్‌కార్డు, ఫొటో, సెల్ నెంబర్ సంఖ్య ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా indianpostgdsonline.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. అక్కడ దరఖాస్తు పేజీ తెరుచుకుంటుంది. సెల్‌ఫోన్, ఈ-మెయిల్ ఐడీ ఆధారంగా రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఖాళీల ప్రకారం ప్రాధాన్యం ఇస్తే సరిపోతుంది. చివరగా రుసుం చెల్లిస్తే దరఖాస్తు పూర్తవుతుంది. ఎంపికైన వారికి తపాల శాఖ నుంచి మొబైల్, ఈ-మెయిల్‌కు వచ్చే సందేశం ద్వారా ఉద్యోగంలో చేరాలి. అభ్యర్థుల వయసు 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వరకు, ఓబీసీ దివ్యాంగులకు 13 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు 15 సంవత్సరాల వరకు గరిష్ఠంగా వయోపరిమితికి సడలింపు కల్పించారు.

తుది గడువు

దరఖాస్తుల దాఖలు ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమైంది. దాఖలుకు తుది గడువు మార్చి 3వ తేదీ. దరఖాస్తులు దాఖలు చేసుకున్న తర్వాత అందులో తప్పులను సరి చేసుకోవడానికి మూడు రోజుల సమయం అంటే మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు ఇచ్చారు. మహిళలు, దివ్యాంగులకు దరఖాస్తు ఉచితం. జనరల్ అభ్యర్థులు రూ.100 రుసుము చెల్లిస్తే సరిపోతుంది. అందుబాటులో ఉన్న మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్నెట్‌లో స్వీకరించిన దరఖాస్తుల్లో మెరిట్ ఆధారంతో పాటు జనరల్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల ప్రకారం ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి నెలకు రూ. 15వేల నుంచి రూ.20వేల వరకు వేతనంతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 53 శాతం డీఏ కింద రూ. 5వేల నుంచి రూ. 6వేల వరకు అదనపు వేతనం వర్తింస్తుంది. మొదట ప్రారంభ వేతనం రూ.10 వేల నుంచి రూ. 12 వేల వరకు ఉంటుంది. ఈ పోస్టులకు ఎంపికైన వారు రోజు 4 గంటలు మాత్రమే పని చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు సంబంధించిన పనులను కూడా నిర్వహించుకోవచ్చు. వీటికి గాను ప్రత్యేకంగా ఇన్సెంటివ్ ఇస్తారు.

జనగామలో కిడ్నాప్ కలకలం

చిన్నారిని ఎత్తుకెళ్లిన దంపతులు


పాపను ఎత్తుకెళ్లిన సురేశ్-ప్రేమలత దంపతులు

జనగామ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలో కిడ్నాప్ ఉదంతం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. జనగామకు చెందిన ఓ వ్యాపారి జిల్లా కేంద్రంలోని కళ్లెం రోడ్డులో నూతనంగా ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నాడు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలైన పార్వతి - రామ్‌జుల్ రజాక్ దంపతులు ఫంక్షన్‌హాల్ నిర్మాణంలో పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 20 రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సురేశ్-ప్రేమలత దంపతులు ఫంక్షన్‌హాల్ నిర్మాణంలో పని చేయడానికి వచ్చి వారు కూడా అక్కడే ఉంటున్నారు. కాగా సురేశ్ దంపతులకు సంతానం లేకపోవడంతో పార్వతి దంపతుల 10 నెలల చిన్న కుమార్తె శివాణితో సన్నిహితంగా ఉండేవారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి శివాణికి చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తామని వారి తల్లిదండ్రులకు చెప్పి, భవన నిర్మాణ కాంట్రాక్టర్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని తీసుకొని సమీపంలోని కిరాణాషాపుకు వెళ్లి అటునుంచి అటే వెళ్లిపోయారు. ఎంత సేపటికీ వారు ఇంటికి తిరిగి రాకపోయే సరికి అనుమానం వచ్చిన పార్వతి దంపతులు బైక్‌తో పాటు పాపను ఎత్తుకెళ్లినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

శివుడికి బిహార్ కార్మికుల జలాభిషేకం

కేసముద్రం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : శివుడి ఆవాస ప్రాంతమైన శ్మశానంలో ఏర్పాటు చేసిన గరళకంఠుని విగ్రహానికి మహాశివరాత్రి సందర్భంగా బిహార్‌కు చెందిన పలువురు కార్మికులు జలాభిషేకం చేశారు. కేసముద్రం విలేజి వైకుంఠదామంలో శివుడి విగ్రహాన్ని కొద్దినెలల క్రితం ఏర్పాటు చేశారు. వైకుంఠదామానికి ఎదురుగానే ఓం శ్రీసాయి రైస్ మిల్లులో పనిచేసే బిహార్ రాష్ట్రానికి చెందిన ఏడుగురు కార్మికులు ప్రతీ సోమవారం తమ ఇష్టదైవమైన శివుడి విగ్రహం అందుబాటులో ఉండడంతో పూజలు నిర్వహిస్తుంటారు. ఇదే క్రమంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగాజలాభిషేకం చేయడం, ఈవీడియోలు స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం విశేషం.

బీసీ ముస్లింలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- బీసీ ముస్లిం యునైటెడ్ ప్లాట్‌ఫామ్ రాష్ట్ర సమన్వయ కర్త రాజ్‌మహ్మద్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన బీసీ ముస్లింల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేయాలని బీసీ ముస్లిం యునైటెడ్ ప్లాట్‌ఫామ్ రాష్ట్ర సమన్వయ కర్త డాక్టర్ రాజ్‌మహ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బీసీ ముస్లిం ఏబీఈ గ్రూప్‌ల వరంగల్ ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు సంబంధించిన రిజర్వేషన్లు మత పరమైనవి కావని, వారు చేస్తున్న వృత్తుల ద్వారా సంక్రమించినవేనని అన్నారు. బీసీ ముస్లింలలోని దూదేకుల, నూర్‌భాషా, పింజారి, లద్దాఫ్ కులాల వారి జీవన విధానాన్ని వెనకబాటుతనాన్ని గుర్తించి 1953లో బీసీ (బీ)లో చేర్చారని అన్నారు. సంచార జీవనం గడుపుతున్న ఫకీర్, బొంత ఫకీర్, గంట ఫకీర్, తురక కాశి, గారడీ, గుడ్డెలుగుల, దోబీ ముస్లిం (తురక చాకలి), హజం, అచ్చుకట్ల, అత్తర్‌సాహెబ్‌లు తదితర కులాల స్థితి గతులపై అధ్యయనం చేసిన జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ ఈ కులాలను 2007లో బీసీ (ఈ)లో చేర్చిందని అన్నారు. బీసీ (ఈ)లో చేర్చి 12 ఏళ్లు గడిచినప్పటికీ వీరి జీవన మనుగడలో ఎలాంటి మార్పును ప్రభుత్వం తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. ఊరూరా తిరుగుతూ పొట్టకోసం నానా పీట్లు చేస్తున్న వీరందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగానే మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెహతర్ (పాకీ) ముస్లింలను 2006 వరకు ఎస్సీ జాబితాలో ఉన్నప్పటికీ 2007 తర్వాత బీసీ (ఏ)లో చేర్చి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్లు కావొస్తున్నా పాలక ప్రభుత్వాలు బీసీ ముస్లింల సంక్షేమాన్ని విస్మరించాయని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం సమాజం జనాభా తక్కువ ఉన్నప్పటికీ ఎంపీ, ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ, మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు కాగలిగారని అన్నారు. బీసీ ముస్లింల జనాభా అధికంగా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యం శూన్యమని దుయ్యబట్టారు. ముస్లింలలో బీసీలు ఉన్నారని, వివిధ వృత్తులు చేస్తూ దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నప్పటికీ వీరి సంక్షేమంపై ఎవరూ పట్టించుకోలేదని, పార్లమెంట్, అసెంబ్లీ , శాసన మండలిలలో వీరి ప్రస్తావనే ఏనాడు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ ముస్లింల జనాభా 36 లక్షలకు పైగా ఉందని, కొంత మందిని కులగణన జాబితాలో చేర్చలేదని అన్నారు. జనాభా ప్రాతిపాదికన బీసీ (ఈ) ముస్లింలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, ప్రత్యేక సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ ముస్లిం ఏబీఈ గ్రూప్ యూనైటెడ్ ప్లాట్‌ఫాం వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు మహ్మద్ అబ్దుల్ అలీం, ఎం.డి. మహమూద్, ఎం.డి. అకూస్, ఎం.డి. రజాక్, ఎం.డి. ఖాజా, ఎం.డి. నయీమొద్దీన్, ఎం.డి. ఖాదర్ మైనోద్దీన్, ఎం.డి. రాజ్ మహ్మద్, మైహెబొద్దీన్, భారత్ బచావో జిల్లా నేత ఎస్. ఓంబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.డి. రాజ్‌మహ్మద్



హనుమకొండ సిద్ధేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



ఖిలావరంగల్ మధ్య కోటలోని స్వయంభూ శంభు లింగేశ్వస్వామి ఆలయంలో బారుల తీరిన భక్తులు

నీలకంఠుడికి నీరాజనం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు
- బ్రాహ్మీ ముహూర్తంలో అభిషేకాలు, హోమాలు
- లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం
- నేత్ర పర్వంగా రుద్రేశ్వరుడి కల్యాణం
- ప్రధాన ఆలయాల వద్ద పటిష్ఠ పోలీసు భద్రత

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఓంకార నాదాలు ప్రతి ధ్వనించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక శైవ క్షేత్రాలు భక్తి భావనతో పులకించాయి. శంభో శంకర.. హరహర మహాదేవ.. అంటూ భక్తులు పరమేశ్వరుడిని మనసారా కొలిచారు. మహాశివరాత్రి వేడుకలు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా భక్తులతో వేయిస్తంభాల ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల తాకిడి అర్ధరాత్రి వరకు కొనసాగింది. పిల్లపాపలతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం నేత్రపర్వంగా రుద్రేశ్వరుడి కల్యాణం నిర్వహించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి, తదితర అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ఏసీ ఆర్.సునీత ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 50 మంది వలంటీర్లు సేవలందించారు. వైభవంగా సాంస్కృతిక ప్రదర్శనలు జాగరణ భక్తుల కోసం నిర్వహించారు.

హనుమకొండలోని మరో ప్రసిద్ధ శైవక్షేత్రం, దక్షిణ కాశీగా పేరొందిన సిద్ధేశ్వరాలయం కూడా భక్తుల తాకిడితో కిటకిటలాడింది. క్యూలైన్‌లలో భక్తులు నిలబడి సిద్ధేశుడిని దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు సిద్ధేశుని రవికుమార్, సురేశ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ



వంగరలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, అనేక మంది ప్రముఖులు ఆలయాన్ని సందర్శించారు. అదే విధంగా హనుమకొండలో నూతనంగా ఆవిర్భవించిన జలేశ్వరాలయంలో కూడా భక్తుల సందడి కొనసాగింది. ఆలయ అర్చకులు శ్రీనివాస కేసరి, అంబటి రాంనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అభిషేకాలు నిర్వహింపజేశారు. రాత్రి ప్రధాన అర్చకుడు వెన్నంపల్లి జగన్‌మోహన్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. జలేశ్వరాలయ కమిటీ ఛైర్మన్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ములుగు రోడ్‌లోని గురుధామంలో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. రుద్రాభిషేకాలు, గురుదేవులకు పల్లకీసేవ, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు త్రిపురనేని గోపీచంద్, బండారు సాయినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పురాణ ప్రవచకులు రాజశేఖర్, శివానందమూర్తి బోధనలను, శివ అనుగ్రహ ప్రాముఖ్యతను తెలియజెప్పారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని పంచ రామాలయంలో తెల్లవారుజాము నుంచి మొదలైన భక్తుల సందడి అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకు కొనసాగింది. సాధారణ రోజుల్లో నిశ్శబ్దంగా ఉండే చిన్న ఆలయం వందలాది భక్తులచే కిటకిటలాడుతూ కనిపించింది.

ఇండస్ ఆధ్వర్యంలో..

మహాశివరాత్రి పర్వదిన వేళ యేటా నిర్వహించే మాదిరిగా ఈసారి ఇండస్ ఫౌండేషన్ ఛైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో హయగ్రీవాచారి గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహించారు. రాత్రి 6గంటల ప్రాంతంలో ప్రారంభమైన కార్యక్రమాల పరంపర గురువారం ఉదయం వరకు కొనసాగాయి. చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సీఎస్ రంగరాజన్ సనాతన ధర్మ విశిష్టతను ఔన్నత్యాన్ని చాటుతూ అనర్గళంగా సాగిన ప్రవచనం, గీతాసారాన్ని కృష్ణతత్వాన్ని ప్రబోధింపజేస్తూ చిన్న వయస్సులోనే హైందవతత్వం, గీతోపదేశంపై పట్టుసాధించిన ఇస్కాన్ ప్రవచకుడు స్వామి ప్రణవానంద్ ప్రవచనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ కవి, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావు తన సహజమైన పాండిత్యం, సాహిత్యంతో, జీవిత సత్యాలతో కూడిన పేరడి పాటలు, పరమశివుడి మహిమ ప్రబోధనలతో గంటకుపైగా అనర్గళ ప్రసంగం కొనసాగింది. తెలంగాణ కవి దేశపతి శ్రీనివాస్ పాట, మాట, ఇటీవల పద్మశ్రీ అందుకున్న గడ్డం సమ్మయ్య బృందంతో చిందుయక్షగాన కచేరి, మరో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్‌తో దేశభక్తి సందేశం, గజ్జెల రంజిత్ నవ్యజల ఆధ్వర్యంలో ప్రముఖంగా పేరుగడించిన పేరిణి శివతాండవం నృత్యాలు.. ఇంకా శ్రీకృష్ణ, మాట్ల తిరుపతి, శిరీషలాంటి పేరున్న కళాకారుల పాటలు, లింగోద్భవ సమయంలో పరమశివుడి అనుగ్రహం పొందేందుకు నిర్వహించిన సప్తహారతి లాంటి కార్యక్రమాలు భక్తులను ఆసాంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తి శివరాత్రి వేడుకలను సుసంపన్నం చేశాయి. బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీష్‌రావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



ఖమ్మం అభినయ రుద్ర నాట్యాలయ గురువు ఫణిల్, శిష్య బృందాన్ని అభినందిస్తున్న ఈవో అనిల్, అర్చకుడు ఉపేంద్రశర్మ

కల్యాణం.. కమనీయం



వేయి స్తంభాల ఆలయం వద్ద శివ పార్వతుల కల్యాణంలో తాళిని భక్తులకు చూపిస్తున్న పూజారి, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని, భక్తులు



రుద్రేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఇండస్ ఆధ్యాత్మిక సమ్మేళనం వేడుకలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హరీష్‌రావు



ఐనవోలులో మల్లన్న కల్యాణం సందర్భంగా తాళి బొట్టును చూపెడుతున్న అర్చకులు

శివనామంతో హోరెత్తిన శైవక్షేత్రాలు



భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రాలన్నీ శివనామంతో హోరెత్తాయి. భూపాలపల్లి జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలడాయి. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణ కాశీగా పేరొందిన మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి పోటెత్తారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి పరమశివుణి పూజించి ప్రసన్నం చేసుకున్నారు. ఈ వేడుకులకు ముఖ్య అతిథిగా భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు హాజరయ్యారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాకతీయుల కాలం నాటి గణపురం మండలంలోని కోటగుళ్లకు భక్తులు భారీగా తరలివచ్చారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఓఎస్‌డీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్, ఎస్సై అశోక్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. గణపురం మండలంలో బుద్దారంలో శివరాత్రి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు-పద్మ దంపతులు హాజరయ్యారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణలో పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రం భూపాలపల్లి, కాటారం, గణపురం, రేగొండ, చిట్యాల, మహాముత్తారం, టేకుమట్ల, మహదేవ్‌పూర్, మల్హర్, మొగుళ్లపల్లి మండలాల్లో శివారాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయాలకు భక్తులు బారులుతీరి ప్రత్యేక పూజలు చేశారు.

మహబూబాబాద్ జిల్లాలో..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తెల్లవారు జాము నుంచే భక్తులు శైవక్షేత్రాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. ఆలయాలన్ని రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడి శివనామస్మరణతో మార్మోగాయి. కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళీసమేత వీరభద్రస్వామి దేవాలయంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్-ప్రమీల దంపతులు, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు-సంధ్యారాణి దంపతులు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర ఏర్పాట్ల నిర్వహణ బందోబస్తును పరిశీలించారు. పెద్దవంగర మండలం చిన్నవంగరలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్-లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీరోలు మండల కేంద్రంలోని శ్రీకాళేశ్వర, ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ట్రస్టీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెడవెల్లి రాజవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



కురవి వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల భారీ క్యూలైన్



ఎదుర్కోలు కార్యక్రమానికి వెళ్తున్న వీరభద్రుడు, భద్రకాళి



రామప్పలో శివపార్వతుల కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రి ధనసరి సీతక్క



పాలకుర్తిలో భక్తులకు శివపార్వతుల తాళి చూపిస్తున్న పండితులు

జనగామ జిల్లాలో..

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శివజయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఓం నమః శివాయః అంటూ శివపంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ భక్తులు తన్మయులయ్యారు. ఓంకార నాదంతో శైవ క్షేత్రాల పరిసరాలు మార్మోగిపోయాయి. పరమేశ్వరుడికి లింగరూపంలో రుద్రాక్షలు, మారేడు దళాలు సమర్పించి భక్తులు అభిషేకించారు. ఉపవాసదీక్షలకు పూనుకొని శివనామ స్మరణతో జాగరణలు చేపట్టారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా పేరొందిన కొడ్వటూరు సిద్ధేశ్వరస్వామి దేవస్థానం, పాలకుర్తి శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం, చీటకోడూరు శ్రీరామింగేశ్వర స్వామి దేవస్థానాల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సౌకర్యార్థం ఆయా దేవాలయ కమిటీలు ఏర్పాటు చేశారు.



పాలకుర్తిలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



బచ్చన్నపేట సిద్దేశ్వరాలయంలో భక్తుల సందడి

ఆలయాల్లో భక్తుల కోలాహలం

ములుగు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వ దినాన హరుడి స్మరణతో ములుగు జిల్లా మార్మోగింది. శివాలయాలు, ప్రముఖ శైవ క్షేత్రాలల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పరమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు అభిషేకాలు, అర్చనలతో కొలుచుకున్నారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రుద్రేశ్వరుడిని దర్శించుకొని పూజలు చేశారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరిగింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క దేవతలకు పట్టువస్త్రాలను సమర్పించారు. ములుగులోని పురాతన నగరేశ్వరస్వామి, మంగపేటలోని ఉమాచంద్రశేఖర స్వామి ఆలయాలతోపాటు ఆయా మండలాల్లోని శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ కమిటీలు, ఉత్సవ మండళ్ల ఆధ్వర్యంలో జాగరణ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించలేదు. ఆలయ ప్రాంగణాల్లో రాత్రంగా జాగరణ చేసిన భక్తులు శివపార్వతులను స్మరిస్తూ భజనలు చేశారు.



మంగపేటలోని వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పెద్దపట్నంపై శివతాండవం

ఐనవోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఐనవోలు మల్లికార్జునస్వామి శైవ క్షేత్రంలో పరమశివుని సేవలో భక్తులు పరవశించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడింది. మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్ద పట్నంను ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల చూర్ణములు(పిండి) ముగ్గులతో కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో పట్నం (మండపమును) 12 అడుగుల వెడల్పు, పొడవుతో అందంగా వేశారు. మధ్యలో స్వామి, అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాధను పఠించారు. తదుపరి భక్తి పరవశంతో పట్నంపై మై మరిచి శివతాండవం నృత్యం చేశారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలిచింది. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్‌ల నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసులు నృత్య మండపం వద్ద తొక్కిసలాట జరుకుండా కట్టడి చేశారు. నృత్యాలు చూడటానికి మండపం వద్ద భక్తులు పోటీ పడ్డారు.



ఐనవోలులో ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం



నర్మెట్ట మచ్చుపహాడ్ నాయిని వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొడకండ్లలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాలకుర్తిలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి



పల్లగుట్ట శివాలయంలో శిఖర కలశానికి అభిషేకం చేస్తున్న ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు

శంభో శంకరా..

●వైభవంగా మహాశివరాత్రి వేడుకలు ● శివనామస్మరణంతో మారుమోగిన ఆలయాలు ● హాజరైన ప్రముఖులు



సిద్ధేశ్వరుడికి పూజలు చేస్తున్న ఏఎస్పీ నితిన్‌చేతన్



సిద్ధేశ్వరాలయ ద్వారం వద్ద దిష్టికుంభం ఎదుట రౌద్ర విన్యాసాలు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినంతో పాటు, ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్దులగుట్టలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న దృష్ట్యా బుధవారం తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య-అనిత దంపతులు స్వయంభూ సిద్ధేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చారిత్రక నేపథ్యం కలిగిన సిద్దులగుట్ట అభివృద్ధికి సహకరించాలని ప్రధానపూజారి ఓంనమఃశివాయ కోరారు. తన తరుపున ఖచ్చితంగా ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం ఉంటుందని విప్ హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దుగూడెం సీతారామచంద్రస్వామి దేవాలయం, చిన్నరామన్‌చర్లలోని స్వయంభూ రాజరాజేశ్వరాలయంతో పాటు సిద్ధేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. బండనాగారం రామలింగేశ్వరాలయం, కట్కూరు రాజరాజేశ్వరాలయం, శివాలయం, ఇటుకాలపల్లి, కొన్నె తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సిద్దులగుట్ట చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, జనగామ, చేర్యాల, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్లు బసుక శివరాజ్‌యాదవ్, నల్లనాగుల శ్వేతవెంకటాచారి, ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్ పురాతన రామలింగేశ్వరాలయంలో, శివునిపల్లి శివాలయం, శ్రీవేంకటేశ్వరాలయంలోని శివాలయంలో, దేవీ లలితాంబికా దేవాలయంలో శివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివునిపల్లి పట్టణ నగరేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా చేపట్టారు. శివునిపల్లి శ్రీవేంకటేశ్వరాలయంలో కాశీ విశ్వేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో నాగరాజు శర్మ, పి.వెంకటేశం, తిరుమల శ్రీనివాస్, కృష్ణారావు, వేద పండితులు రంగాచారి, వెంకటేశ్వర్లు, రఘునాథాచార్యులు, సీహెచ్ జగన్‌రెడ్డి, గోలి శ్రీనివాస్, పి.రమేశ్, కె.సతీష్, పూజారులు జె.నాగరాజు శర్మ, రామలింగయ్య, శ్రవణ్, శ్రీరాములు, వెంకట్రాంనర్సయ్య, గోలి రాజశేఖర్ పాల్గొన్నారు.

● చిలుపూర్: మండలంలోని పల్లగుట్ట శివాలయంలో స్థానిక చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కిరణ్మయి దంపతులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజుతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఫతేపూర్ బండలగట్టు శివ గంగేశ్వర స్వామి ఆలయంతో పాటు, మల్కాపూర్, చిన్నపెండ్యాల, నష్కల్ గ్రామాల్లోని శివాలయాల్లో ఏడవెల్లి మాధవరెడ్డి -మణెమ్మ, పోలేపల్లి మాధవి -రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి తదితరులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

● నర్మెట : మండలకేంద్రంతో పాటు మచ్చుపహడ్, వెల్దండ, అమ్మాపురం, హన్మంతపూర్ కన్నెబోయినగూడెం, మల్కాపేట, గండిరామవరం తదితర గ్రామాలలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి, బీఆర్ఎస్ ఉమ్మడి కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, మచ్చుపహడ్ గ్రామ మాజీ సర్పంచ్ రామిని శివరాజు, డీసీసీ కార్యదర్శి భూక్య జయరాం, భక్తులు పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై స్వయంభువుడుగా వెలసిన భద్రకాళి సహిత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్డిచర్లలో శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. కళ్లెం, చీటూరు, వనపర్తి, కుందారం, నెల్లుట్ల గ్రామాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంబాల వీరస్వామి, బండ్రు సత్తయ్య, ఏదునూరి వీరయ్య, వంగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెంలోని కాకతీయుల నాటి నాగులమ్మ ఆలయంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. పాంనూర్‌లోని రాజరాజేశ్వరస్వామి శివాలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. రాఘవపూర్‌లో పార్వతిసమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మందపురం ఎల్లాగౌడ్-కవిత, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల యాకయ్యగౌడ్, నాయకులు తోట వెంకన్న, ఒగ్గు రాజు, పొన్న బీరయ్య, సారయ్య, సునిల్, తదితరులు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శ్రీమహాదేవ స్వామి, వెల్ది గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాలలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వెల్దిలోని శ్రీరామలింగేశ్వర స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన సుమారు రూ.45 వేల విలువైన పంచలోహ నాగాభరణ భూషణాన్ని పొట్లపల్లి అమరేందర్ రావు-చంద్రిక దంపతులు వారి తండ్రి జ్ఞాపకార్థం స్వామి వారికి అందజేశారు. కార్యక్రమంలో కూరెల్లి పెద్ద ఉపేందర్-రేణుక దంపతులు, వేదకుమార్, వినయ్‌కుమార్, ఓరుగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గఢ్: జఫర్‌గడ్‌తో పాటు కూనూరు, తమ్మడపల్లి(ఐ), తిడుగు, ఉప్పుగల్లు, తదితర గ్రామాల్లోని శ్రీఉమానీలకంఠ స్వామి, శ్రీరాజరాజేశ్వర స్వామి, ఉమామహేశ్వర భక్తాంజనేయ స్వామి, తదితర శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవ వేడుకలు జరిగాయి. మండల కేంద్రంలో ఉమానీలకంఠ స్వామి ఆలయంలో రాత్రి శివకల్యాణ వేడుకలను నిర్వహించారు.

మండలంలోని తిమ్మంపేటలోని శ్రీమల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి.. కొండపై ఆలయంలో కేతమ్మ, కేడలమ్మ ఇద్దరు సతుల సమేతంగా కొలువుదీరిన శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉత్సవాల్లో భాగంగా నేడు గురువారం ఆలయ ఆవరణలో స్వామి వారికి పెద్ద పట్నం, చిన్న పట్నాలతో పాటు భక్త జనుల సమక్షంలో స్వామి వారి కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

● పాలకుర్తి: హరి హర క్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ పరిసర ప్రాంతంలో పారిశుధ్య పనులను అధికారులు పర్యవేక్షించారు. జనగాం డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో సుమారు 100 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం నియమించారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి వేర్వేరుగా హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తమ స్వంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీపీవో స్వరూప, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్‌డీవో పీడీ వసంత, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న సీఐ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఎస్సై పవన్‌కుమార్, ఆలయ ఈవో మోహన్‌బాబు, పీఆర్‌డీఈ చారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులుతదితరులున్నారు.

● దేవరుప్పుల: మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో భక్తులు మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా దేవరుప్పులలోని ఉప్పల మల్లన్న ఆలయంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునుడికి, సీతారాంపురంలోని శివాలయంలో ఉమా చంద్రమౌళీశ్వరుడికి భక్తులు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. ఇంకా పెద్దమడూరు, చిన్నమడూరు, కోలుకొండ తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు పెద్దాపురం వెంకటేశ్వర శర్మ, పానుగంటి రామలింగం పాల్గొన్నారు.

● కొడకండ్ల: మండలకేంద్రంలోని 7 వందల సంవత్సరాల పురాతన శివాలయంలో మహాశివరాత్రి ఘనంగా నిర్వహిలచారు. ఈ సందర్భంగా శివ పార్వతుల కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకస్వాములు మౌర్య శర్మ, నాగదక్షిణామూర్తిలు ఆలయంలో బుధవారం ఉదయం నుంచి పంచామృతాలతో రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించి లింగోద్భవ కాలంలో రాత్రి 12 గంటల నుంచి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల సరిత, శ్రీపాద అంజనేయులు, రమాదేవి, గోరెంకల శ్రీనివాస్, లలిత, రేణుక, దామెర పద్మ, మమత, జ్ఞానేశ్వరాచారి, సత్యలక్ష్మి, సుంకరనేని కోటేశ్వరి,



దేవరుప్పులలో పూజలు చేస్తున్న భక్తులు



స్టేషన్ ఘన్‌పూర్ శివాలయంలో క్యూలైన్లో భక్తులు



జఫర్‌గడ్‌లోని శ్రీఉమా నీలకంఠ మహేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



వెల్ది గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచలోహ నాగాభరణ భూషణాన్ని బహూకరిస్తున్న భక్తులు



పాంనూర్ లో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పాంనూర్‌లో ఘనంగా శివరాత్రి యజ్ఞం

47 ఏళ్లుగాశివరాత్రి సందర్భంగా యజ్ఞాల నిర్వహణ

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంనూర్‌లోని వివేకానందాశ్రమంలోని శివాలయం, గాయత్రీమాత ఆలయం అవరణలో బుధవారం శివరాత్రి దైవయజ్ఞం పూజలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమం ఏర్పాటు నాటి నుంచి గత 47 ఏళ్లుగా శివరాత్రి పండుగ రోజున యజ్ఞం నిర్వహించే ఆనవాయితిలో భాగంగా దైవయజ్ఞం తంతును నిర్వహించారు. తోమ్మిది మంది దంపతుల జంటలు మాత్రమే దైవయజ్ఞంలో పాల్గొనే అవకాశం ఉంటుంది. దీంతో దంపతులు పోటీ పడాల్సి వచ్చింది. యజ్ఞం పూజలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దైవయజ్ఞం పూర్తైన తరువాత ఆశ్రమంలో కొలువుదీరిన శివాలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలు నిర్వహించడానికి గాను ధర్మసాగర్ మండలంలోని గాయత్రి పరివార్ కేంద్రం నుంచి అర్చకుడు మార్గం సదానందం వచ్చి యజ్ఞం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహాలు యంజాల ప్రభాకర్, సుధాకర్, కిరణ్‌కుమార్, నాయకులు డాక్టర్ కరుణాకర్ రెడ్డి-మంజుల, గట్టు వెంకన్న-వాణి, వంగ శ్రీనివాస్‌గౌడ్, యాకయ్యగౌడ్, ముగ్ధంపురం కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను అడ్డుకున్న కానిస్టేబుల్



ఎంపీడీవోను అడ్డుకుంటున్న కానిస్టేబుల్

పాలకుర్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆల యంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విధులు నిర్వహిస్తున్న పాలకుర్తి ఎంపీడీవో ఆవుల రాములును గుట్టపైకి వెళ్లకుండా పోలీసు కానిస్టే బుల్ అడ్డుకున్నారు. ఎంఈడీవో రాములు పంచాయతీ కార్యదర్శులుతో కలిసి దేవస్థానంలో విధులు నిర్వహించేందుకు అటుగా వెళ్తుండగా తహసీల్దార్ కార్యాలయం వెనుక విధుల్లో ఉన్న కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. తాను ఎంపీడీవోనని తనపేరు రాములు అని ఆయన చెప్పినప్పటికీ మీరెవరైతే నాకేంటి అని ఖరాఖండిగా అర్ధగంటపాటు ఎండలోనే నిల్చోబెట్టాడు. దీంతో ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవోను అడ్డుకున్న విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. అయితే పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ అధికారి వాహనం మాత్రం జాతరలో నిబంధనలకు విరుద్ధంగా మహమండపం వద్దకు చేరడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఎంపీడీవోకు, సామాన్య ప్రజలకు ఒక న్యాయం, పోలీసులకు మరొక న్యాయం అంటూ భక్తులు విమర్శలు గుప్పించారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బంది బుధవారం చేరుకున్నారు. ఘన్‌పూర్ పోలింగ్ కేంద్రం నెంబర్ 12లో 67మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. అందుకుగాను సిబ్బంది ఏర్పాట్లను పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు కొలిపాక శ్రీకాంత్, సతీష్, ఎస్సై వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

● పాలకుర్తి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

● దేవరుప్పుల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలోని కామారెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో పోలింగు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం పాఠశాలకు చేరుకుని ఏర్పాట్లు చేశారు.



కామారెడ్డిగూడెం హైస్కూల్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

ఎన్నికల సిబ్బందికి స్థానిక రెవెన్యూ అధికారులు సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో సిబ్బందితో పాటు స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, యాదగిరి పాల్గొన్నారు.

కడియం సొంత ఇమేజ్‌తో గెలిచారు

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అయనకు ఉన్న సొంత ఇమేజ్‌తో ఎమ్మెల్యేగా గెలిచారే తప్ప బీఆర్ఎస్ పార్టీ పేరుతో గెలువలేదని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న తెలిపారు. బుధవారం ఘన్‌పూర్ మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరి గాలిలో గెలిచారని కేటీఆర్ మాట్లాడడం దయ్యాల వేదాలు పలికినట్లు ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసిన వాటిని అధిగమించి ప్రజల ఆశీస్సులతో గెలిచారే తప్పా బీఆర్ఎస్ పుణ్యంతో గెలువలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేరుతో కడియం గెలిస్తే మిగితా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఎందుకు గెలువలేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ నాయకులే బీఆర్ఎస్‌లో చేరారు తప్పా ఇతర పార్టీల వారు ఎవరు చేరలేదన్నారు. చేరికల పేరుతో గొప్పలు చెప్పుకోవాలని చూడడం సిగ్గుచేటు అన్నారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అంబటి కిషన్‌రాజ్, పల్లె రవీందర్‌గౌడ్, జీడి రమేష్, జీడి ప్రసాద్, నట్ల రాములు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో హోమపూజ చేస్తున్న పూజారులు

వేంకన్న ఆలయంలో మాస కల్యాణం

చిలుపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న ఆలయంలో బుధవారం హోమపూజతో పాటు, మాస కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న ముందుగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన భక్తులకు పూజారులు తీర్థప్రసాదాలతో పాటు, ఆశీర్వచనం అందించారు.

ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా సోమేశ్వర్



రఘునాథపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా మండలంలోని కన్నాయిపల్లి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సోమేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో బుధవారం జరిగిన ఎన్నికల కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా మాదవిశెట్టి వరూధిని, ఎన్నికల పర్యవేక్షకులుగా బెజుగం భిక్షపతి, పడకంటి రవిందర్, సరాబు అంజనేయులు, గంగిశెట్టి అనూజ, తమ్మి స్రవంతి, గందె సోమన్న, మాశెట్టి వేణుగోపాల్, చీదర జగదీష్, బజ్జూరి మణికాంత్, గోలి రాజశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా సోమేశ్వర్ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడమే లక్ష్యంగా అంకిత భావంతో పని చేస్తానని అన్నారు. ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, గన్ను నర్సింహులు, కూరెల్లి ఉపేందర్, అయితా జయరాములు, శ్యాంశెట్టి శంకరయ్య, పోకల శివకుమార్, గందె వీరయ్య, రవి, గందె లిరిల్ కుమార్, ఓరుగంటి శంకర్‌లింగం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



కట్టుబట్టలతో నిరాశ్రయులైన బాధిత కుటుంబ సభ్యులు

పెంకుటిల్లు దగ్ధం

● మంటల్లో కాలి బూడిదైన వస్తువులు, నగదు, బంగారం

జఫర్‌గడ్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ఓ పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన బుధవారం మండలంలోని కోనాయిచలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అన్నదమ్ములైన జోగు బాబు, రాజుల రెండు కుటుంబాలు ఒకే పెంకుటింట్లో జీవనం సాగిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా ఉదయం ఇంటికి తాళం వేసి ఆ రెండు కుటుంబాల వారు గ్రామంలోని శివాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో అకస్మాత్తుగా దట్టమైన పొగలతో మంటలు అంటుకున్నాయి. గమనించిన చుట్టు పక్కల వారు మంటలను ఆర్పేందుకు యత్నించారు.

అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న బియ్యం, సామాన్లు, బీరు వాలోని బట్టలు, రూ.25 వేల నగదుతో పాటు రెండు తులాల బంగారు వస్తువులు, 10 తులాల వెండి పట్టగొలుసులు కూడా కాలిపోయాయని బాధితులు విలపిస్తూ తెలిపారు. కాగా, ఇల్లు దగ్ధంతో రెండు కుటుంబాల వారు కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం స్పందించి నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని బాధితులు, గ్రామస్థులు కోరుతున్నారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. అయితే మంటలను ఆర్పేందుకు ఫైరింజన్ కోసం ఫోన్ చేయగా అందుబాటులో లేదని సమాచారం వచ్చిందని స్థానికులు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

జఫర్‌గడ్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనూరులో అన్యాక్రాంత మవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ది చేంజ్ ఫౌండేషన్ ఎన్‌జీఓ చైర్మన్ కలకోట సునీల్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కూనూరులోని పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను కొందరు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారన్నారు. అలాగే గ్రామానికి సంబంధించిన నీటి కుంట కూడా ఆక్రమణకు గురైందన్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో భూములను ఆక్రమార్కులు ఆక్రమించుకుంటున్నార న్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టరేట్‌లో ఇటీవల ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.